

నేరడిగొండలో ఎమ్మెల్యే నివాసం వద్ద కేక్‌కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

# అనిల్ జాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు**



తిరుమల ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 16 : జన హృదయనేత, బోథ్ నియోజకవర్గ ముద్దుబిడ్డ, ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పుట్టినరోజు వేడుకలు కనుల పండువగా జరిగాయి. నేరడిగొండలోని ఆయన నివాసం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు కేక్‌కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సంతోష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాథోడ్ సవాయిరాం, జాదవ్ రమేశ్, సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, అంబేకర్ పండరి, రాథోడ్ సురేందర్, జాదవ్ గణేశ్, జాదవ్ ధన్‌రాజ్, గులాబ్‌సింగ్, శ్రీనివాస్, సాబ్లె సంతోష్‌సింగ్, సాబ్లె ప్రతాప్‌సింగ్, రాథోడ్ రవీందర్, రాజశేఖర్ హాజరయ్యారు.

**తిరుమలను దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు**

తిరుమల వెంకటేశ్వర స్వామిని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా తిరుమల ఏడుకొండల వెంకన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో జీవించాలని ఆ దేవుడిని వేడుకున్నారు.

**మొక్కలు నాటిన ముక్రా(కే) గ్రామస్తులు**

ఇచ్చోడ, జూన్ 16 : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ 50వ జన్మదినం సందర్భంగా సోమవారం మండలంలోని ముక్రా(కే) గ్రామంలో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా 50 మొక్కలు నాటి రక్షిస్తామని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ముక్రా(కే) గ్రామస్తులు

## బోధించే బడిలోనే పిల్లల చదువు



పాఠశాలలో చదువుతున్న తన పిల్లలతో ఉపాధ్యాయుడు సామనపెల్లి గంభీర్

తాంసి, జూన్ 16 : సర్కారు బడిలో బోధించే ఉపాధ్యాయుడు వారి పిల్లలను గవర్నమెంట్ పాఠశాలలో చదివిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామనపెల్లి గంభీర్ గతేడాది తలమడుగు మండలంలోని కుచులాపూర్ ప్రాథమిక పాఠశాలలో బోధించి బదిలీపై తాంసి మండలంలోని కప్పర్ల పాఠశాలకు వచ్చాడు. అయితే గంభీర్ అంతకు ముందు కుచులాపూర్ పాఠశాలలో కూడా తనతోపాటే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించానని తెలిపాడు. ప్రస్తుతం కప్పర్ల పాఠశాలలో కుమారుడు కృష్ణ 2వ తరగతి, కూతురు ప్రజ్ఞశ్రీ 4వ తరగతి చదువుతున్నారు. వారు బోధిస్తునన బడిలోనే పిల్లలను చేర్పించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంభీర్‌ను అందరూ అభినందిస్తున్నారు. ఇటువంటి వారికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ఇవ్వాలని స్థానికులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.



# పెట్టుబడికి పుట్టెడు దుఃఖం

- జొన్న డబ్బులు రూ.180 కోట్లు రాక అవస్థలు
- పంట విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా జమ కాని పైసలు
- దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- రైతు భరోసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

ఆదిలాబాద్, జూన్ 16(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో వానకాలం ప్రారంభకావడంతో రైతులు పత్తి, కంది, సోయా సాగు చేయడానికి భూములను సిద్ధం చేసుకున్నారు. తొలకరి పులకరించగానే విత్తనాలు వేసేందుకు ఎదురు చూస్తున్నారు. పెట్టుబడి కోసం అవస్థలు పడాల్సి వస్తున్నది. జిల్లా వ్యాప్తంగా వానకాలంలో 5.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా పత్తి 4 లక్షల ఎకరాల్లో పండిస్తారు. ఎకరానికు రూ.40 వేల వరకు పెట్టుబడి అవసరమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న యాసంగిలో అరకొరగా రైతులకు అందింది. జిల్లా వ్యాప్తంగా 1.67 లక్షల మంది రైతులు ఉండగా.. నాలుగు ఎకరాల లోపు 90 వేల మందికి మాత్రమే ప్రభుత్వం ఎకరానికు రూ.6 వేల చొప్పున రైతు భరోసా పంపిణీ చేసింది. వానకాలం ప్రారంభమైన రైతు భరోసా ఊసే లేకపోవడంతో రైతులు పెట్టుబడి కోసం కమీషన్ ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. వారి వద్ద నుంచి ఎక్కువ వడ్డీతో బాకీలు తీసుకుని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.

**జొన్నల డబ్బులకు ఎదురుచూపు**

జిల్లాలో రైతులు యాసంగిలో జొన్న పంటను ఎక్కువ పండిస్తారు. ఈ ఏడాది 1.10 లక్షల ఎకరాల్లో జొన్న సాగు చేశారు. దిగుబడి ఎకరాకు 15 క్వింటాళ్లు వచ్చింది. జిల్లా వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం పంటను సేకరించింది. జిల్లాలో ఏప్రిల్ 18 జొన్నల కొనుగోలు ప్రారంభం కాగా.. మే 6వ తేదీ వరకు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 56 వేల టన్నుల పంటను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సేకరించారు. ఇందుకు రైతులకు రూ.180 కోట్లు రావాల్సి ఉంది. పంటను విక్రయించిన వారం, పది రోజులకు రావాల్సిన డబ్బులు 50 రోజులు గడుస్తున్నా అందడం లేదు. ఏటా జొన్న పంటను విక్రయించిన డబ్బులతో రైతులు వానకాలం పెట్టుబడి కోసం ఉపయోగిస్తున్నారు. ఈసారి డబ్బుల పంపిణీలో జాప్యం కారణంగా పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తమకు రైతుభరోసా రాక, జొన్నలు అమ్మిన డబ్బులు అందక కమీషన్ ఏజెంట్లు వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొంటున్నామని రైతులు అంటున్నారు.

### అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొంటున్నాం..



నేను ఏప్రిల్ 23వ తేదీన ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంలో 41 క్వింటాళ్ల జొన్నలను విక్రయించా. రూ.1.38 లక్షలు రావాల్సి ఉండగా, అధికారులు పది రోజుల్లో పైసలు వస్తాయని చెప్పారు. ఇప్పటికి 50 రోజులు గడుస్తున్నా రాలేదు. అధికారులను అడిగితే రేపూమాపూ వస్తాయంటున్నరు. వానకాలం రైతు భరోసా, జొన్నలు అమ్మిన పైసలు రాకపోవడంతో సాగు కోసం అప్పు చేయాల్సి వస్తుంది. దళారులు అధికవడ్డీలు తీసుకుని అప్పులు ఇస్తున్నారు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా, జొన్నల పైసలు పంపిణీ చేయాలి. **- రాజు పటేల్, రైతు, చింతగూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం**

## నిర్మల్ జిల్లాలోనూ నిరీక్షణ

కుంటాల, జూన్ 16 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా 40 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 28 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా 7,543 మంది రైతుల నుంచి 2,26,583 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశారు. వీటి రూ.76.38 కోట్లను రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. పంట విక్రయించిన 72 గంటల్లో డబ్బులను జమ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజులు దాటినా ఇవ్వడం లేదు. వానకాలం సాగు కోసం జొన్నల డబ్బులను తమ ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా.. రెండు, మూడు రోజుల్లో డబ్బులు వచ్చే అవకాశం ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

### 45 రోజులైనా డబ్బులు రాలే..



పంట మార్పిడి చేసి ఈసారి జొన్న పండించిన. 68 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సర్కారు కొనుగోలు కేంద్రంలో అమ్మిన. 45 రోజులైంది. ఇంతవరకు పైసలు అకౌంట్‌లో పడలేదు. సార్లకు అడిగితే 2 రోజులు 3 రోజుల్లో వస్తాయి అంటున్నరు. మా కుటుంబం మొత్తం క్రాప్ లోను 1.60 లక్షలు ఉన్నా రుణమాఫీ వర్తించలేదు. వెంటనే జొన్నల పైసలు పంపించి రుణమాఫీ చేయాలి. **- మనోహర్, రైతు, వెంకూర్.**

### రైతు భరోసా వేయలేదు..



వ్యవసాయం మీదనే ఆధారపడి బతుకుతం. రెండు కాలాలు పండిస్తాం. 50 క్వింటాళ్ల జొన్న నెల కిందట సర్కార్కు అమ్మిన. ఇంత వరకు పైసలు రాలేవు. రైతు భరోసా కూడా రాలేదు. ఆనకాలం పంటల కోసం ఇప్పుడు భూమి పొతం చేసి విత్తుతున్నాం. ట్రాక్టరు, కూలీలు, విత్తనాలకు బాగా ఖర్చవుతుంది. రైతు భరోసా కూడా ఇంత వరకు వేయలే. పంటల పెట్టుబడికి కష్టమవుతోంది. **- కన్నం లక్ష్మణ్, రైతు, అందకూర్.**

# ప్రజావాణికి భారీగా దరఖాస్తులు

**సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు 104 వినతులు**

- పెండింగ్ సమస్యలు వారంలో పరిష్కరించాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, జూన్ 16(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ రాజర్షి షా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 104 మంది వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. దరఖాస్తుదారులతో మాట్లాడిన కలెక్టర్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పలు సమస్యల కారణంగా ఫిర్యాధులు భారీగా వస్తుండడంతో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి తీసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు తమకు మంజూరు కాలేదని, అనర్హులకు మంజూరు చేశారంటూ పలువురు కౌంటర్‌లో దరఖాస్తులు సమర్పించారు.

### అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు ఇవ్వాలని మాజీ కౌన్సిలర్ అలాల అజయ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 33 వార్డుకు చెందిన పేదలు వినతిపత్రం అందజేశారు. వార్డులో 12 మందికి ఇండ్లు మంజూరు కాగా లబ్ధిదారుల వయస్సు 60 సంవత్సరాలు దాటాయని వారికి ఇండ్లు రద్దు చేశారని, వారి కుటుంబ సభ్యులకు మంజూరైన ఇండ్లను కేటాయించాలన్నారు. 20 ఏండ్ల కిందట ఇండ్లు వచ్చిన వారి కుటుంబ సభ్యులకు ఇండ్లు మంజూరు చేయడం లేదని, మున్సిపాలిటీ అధికారులు అనుభవం లేని వారితో జియో ట్యాగింగ్ చేయడం వల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సరిగా జరగలేదని తెలిపారు.

### రెయిన్ కోట్‌లు, బియ్యం ఇవ్వాలి

తమకు బియ్యం, ఇతర ఆహార వస్తువులతోపాటు రెయిన్ కోట్‌లు, చేతిగ్లౌజ్‌లు, బూట్లు, ఇతర రక్షణ పరికరాలకు అందజేయాలని ఆదిలాబాద్ మున్సిపాలిటీ కార్మికులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. నిబంధనల మేరకు కార్మికులకు ఇవ్వాల్సిన వాటిని అందజేయాలన్నారు. వర్షాకాలంలో రెయిన్ కోట్‌లు లేని కారణంగా తడుస్తూ పనిచేయాల్సి వస్తుందన్నారు.





### మధ్యాహ్న భోజనం బిల్లులు ఇవ్వాలి..

ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు మధ్యాహ్న భోజనం పెడుతున్న తమకు ఏడాదిగా వేతనంతోపాటు ఇతర బిల్లులు మంజూరు కావడం లేదని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వాహకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏడాదిగా కోడిగుడ్ల బిల్లులు రావడం లేదని, మెస్ బిల్లులు ఆరు నెలలు, రాగిజావ బిల్లులు 8 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఐదు నెలల నుంచి తమకు రావాల్సిన వేతనాలు రావడం లేదన్నారు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో తాము అప్పులు తీసుకొచ్చి భోజనం వండి పెడున్నామన్నారు.

## బాసర గోదావరిలో బోట్ల నిషేధం

బాసర, జూన్ 16 : బాసర గోదావరి నది వద్ద సోమవారం నుంచి బోట్లను నిషేధిస్తున్నట్లు భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు బోట్లను నిషేధిస్తున్నట్లుగా తెలిపారు. ఆదివారం నదిలో ఐదుగురు మృత్యువాత పడడంతో అధికార యంత్రాంగం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నదిలోకి భక్తులను పడవల్లో తీసుకెళ్లవద్దని, నిబంధనలు పడవల నిర్వాహకులకు పాటించాలని సర్క్యులర్ జారీ చేశారు.



నది వద్ద ఒడ్డున నిలిచిన బోట్లు

# బంధువుల ఇంటికి వెళ్లివస్తూ..

- ఇద్దరు మృత్యువాత..
- ఒకరికి తీవ్ర గాయాలు.. మరో ఇద్దరికి గాయాలు
- బిర్సాయిపేట్ సమీపంలో చెట్టుకు బలంగా ఢీకొట్టిన కారు



గంట విజయలక్ష్మి(ఫైల్)



సహర్ష(ఫైల్)

ఉట్నూర్ రూరల్, జూన్ 16 : ఉట్నూర్ మండలంలోని బిర్సాయిపేట్ గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంట విజయలక్ష్మి(55), సహర్ష(14) మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఈర్ల రాజు, అతని భార్య సృజనిత, వీరి కుమారుడు సహర్ష, కూతురు ఆద్యశ్రీ, సృజనిత అమ్మ గంట విజయలక్ష్మి టీఎస్ 1 ఈపీ 9764 నంబరు గల కారులో మంచిర్యాల జిల్లా బెల్లంపెల్లిలోని తమ బంధువుల ఇంటి నుంచి ఆదిలాబాద్‌కు తిరిగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం బిర్సాయిపేట్ గ్రామ సమీపంలో కారు అదుపు తప్పి చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సహర్ష, విజయలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. ఆద్యశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. రాజు, సృజనలకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్సలందించారు. మెరుగైన చికిత్స కొరకు రిమ్స్‌కు తరలించారు. ఆద్యశ్రీకి తీవ్ర గాయాలు కావడంతో రిమ్స్ దవాఖాన నుంచి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాలను ఉట్నూర్ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల బంధువు జగన్మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ తెలిపారు.

## ఆదర్శ ఉపాధ్యాయుడు

**తమ కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన టీచర్**

ఉట్నూర్ రూరల్, జూన్ 16 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రాథోడ్ రవీందర్ తన కుమారుడు రాథోడ్ వరుణ్ నాయక్‌ను అతను బోధిస్తున్న పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించి ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా రవీందర్‌ను కాంపెక్స్ హెచ్ఎం భరత్ చౌహాన్ అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. రాథోడ్ రవీందర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉపాధ్యాయుడు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, మాజీ సర్పంచ్ జగదీష్ జాదవ్ పాల్గొన్నారు.



శ్యాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొందుతున్న ఉపాధ్యాయుడు రాథోడ్ రవీందర్ కుమారుడు వరుణ్ నాయక్